క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి కల్యాణం

రాపూరు/సైదాపురం/కోట: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు. అదేవిధంగా మండల కేంద్రమైన సైదాపురంలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నగర సంకీర్తనలు చేపట్టారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కోట మండలంలోని చెందోడులో శనివారం పుట్టాలమ్మ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

కోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో 2 మస్తానయ్య ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన శనివారం వెంకన్నపాళెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే

రాపూరు: మండలంలోని కోటూరుపాడు గ్రామంలో శనివారం వైద్యాధికారులు కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సూర్యధర్మేంద్ర మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు చింతవరం గ్రామానికి చెందిన కావేరిపాకం చంద్రోశేఖర్, నిర్మలమ్మ అన్నదానం చేశారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు వితరణ



సరుకులు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

నాయుడుపేట టౌన్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని మేరి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వికాస్ తన సిబ్బందితో కలిసి నెలకు సరిపడా సరుకులు, బియ్యం బస్తాలు అందజేశారు. బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. నిర్వాహకులు సునిత, బెన్ని అభినందించారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం గోమతి సర్కిల్ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై శనివారం వాహనాలను అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈబీ సీఐ అరుణ కుమారి తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఎర్రచందనం, బియ్యం తదితరాలు అక్రమంగా రవాణా కాకుండా నిఘా పెట్టినట్టు సీఐ తెలిపారు.

సర్పాల సయ్యాట



గూడూరు రూరల్ : నిత్యం రద్దీగా ఉండే గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న మీ సేవా కేంద్రం సమీపంలో శనివారం సాయంత్రం రెండు పాములు ఒకదానికొకటి పెనవేసుకుని సయ్యాట ఆడాయి. అవి సుమారు రెండు గంటల పాటు అలా ఉండిపోవడంతో అటుగా వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యాలయాల వద్ద పాములు తిరగడాన్ని చూస్తుంటే భయమేస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

రైతన్నకు పెట్టుబడి సాయమేదీ..?

అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. పొలాలను దుక్కులు చేసుకుంటున్నారు. నారు మడులు సిద్ధం చేసుకుంటున్నారు. పెట్టుబడి కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో పెట్టుబడి ఎలా అని వారు ఆవేదన చెందుతున్నారు. ఇలా అయితే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎలా కొనుగోలు చేయాలని వారు పేర్కొంటున్నారు. – వెంకటగిరి రూరల్

- రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న ప్రభుత్వం
- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపు
- పీఎం కిసాన్ కింద రూ.2 వేలు ఖాతాల్లో జమ



వ్యవసాయ పంట పొలం



నీరులేకుండా ఎండిపోయిన తెలుగుగంగ కాలువ

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో వెంకటగిరిలో 6600 మంది, బాలాయపల్లిలో 7400 మంది, డక్కిలి మండలంలో 7120 మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వారు వేరుశనగతోపాటు, వరి, నువ్వులు తదితర పంటలు సాగు చేస్తున్నారు. వారికి గత ఐదేళ్లలో ప్రభుత్వం పీఎం కిసాన్, రైతు భరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 ఖాతాల్లో జమచేసేది. ఖరీఫ్‌లో తొలి విడతగా పీఎం కిసాన్ కింద రూ.2 వేలు, రైతు భరోసా కింద రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 అందేది. ఈ నిధులు దుక్కులు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఎంతగానో ఉపయోగపడేవి. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు.

నేడు తప్పని ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెలరోజులైనా పెట్టుబడి సాయం గురించి పట్టించుకోలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టినా ప్రభుత్వం సాయం గురించి ఇంత వరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. పీఎం కిసాన్ పథకం కింద 17వ విడత నిధులను జూన్ 18 తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విడుదల చేశారు. రైతుల ఖాతాల్లో రూ.2 వేలు చొప్పున జమ చేశారు. ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో ఏమి చేయాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ తరుముకొస్తుండడంతో విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తుందేమోనని వాపోతున్నారు. పెట్టుబడులు లేక కొందరు పొలాలను బీళ్లు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు.

తగ్గిన ఖరీఫ్ సాగు విస్తీర్ణం

పెట్టుబడి సాయం అందకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. గత ప్రభుత్వంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో సుమారు వరి 1890 హెక్టార్లు, వేరుశనగ 360 హెక్టార్లు, నువ్వులు 60 హెక్టార్లలో సాగు చేశారు. ఈ ఏడాది వరి 1,374 హెక్టార్లు, వేరశనగ 300 హెక్టార్లు, నువ్వులు 40 హెక్టార్లలో మాత్రమే సాగు చేస్తున్నట్టు అధికారుల లెక్కలను బట్టి తెలుస్తోంది.

తెలుగుగంగ నీరు లేక బీడులుగా పంట పొలాలు

సాధారణంగా ఖరీఫ్ ప్రాంభం కాగానే తెలుగు గంగ కాలువ ద్వారా నీరు సరఫరా చేసేవారు. ఈ ఏడాది నీటిని నిలిపివేయడంతో కాలువ ఆధారంగా పంటలు సాగుచేస్తున్న రైతులు పొలాలను బీళ్లుగా పెట్టాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో గంగ నీటిని నమ్ముకుని సుమారు పదివేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు.

రాపూరులో ప్రబలుతున్న మలేరియా



రాపూరులో మలాథియాన్ స్ప్రే చేస్తున్న వైద్యసిబ్బంది

రాపూరు: రాపూరులో మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయని వేపినాపి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ లింగమూర్తి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రాపూరు కొత్తపేటకు చెందిన ఖలీల్ అనంతపురం జిల్లా తాడిపత్రిలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. అతనికి జ్వరం రావడంతో రాపూరు వచ్చాడని, వైద్య సిబ్బంది పరీక్షలు చేయగా మలేరియా ఉన్నట్టు తెలిసిందన్నారు. దీంతో ఆ ప్రాంతంలో మలాథియాన్ చల్లించినట్టు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది వెంకటేశ్వరరావు, అబ్దుల్లా, వరదయ్య, కాంతమ్మ, ప్రసాద్ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జోరేపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజకుమారి

జోరేపల్లిలో వైద్యశిబిరం

రాపూరు మండలం జోరేపల్లిలో జ్వరాలు ప్రబలడంతో శనివారం వైద్య శిబిరం నిర్వహించినట్టు వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు రాజకుమారి తెలిపారు. గ్రామంలో ఇంటింటా సర్వే చేసి జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసినట్టు తెలిపారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అబేట్ ద్రావణం చల్లించామన్నారు. వర్షాలు కురుస్తున్నందున టఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది నజీమున్నీసా, ఇందిరమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై గ్రామసభ

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరు, బల్లవోలు గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ పనులపై తనిఖీలు పూర్తయిన సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, కూలీలకు చెల్లించిన నగదు, ఆ పనులు ఎంత వరకు ప్రజలకు ఉపయోగపడ్డాయి తదితర విషయాలపై సామాజిక తనిఖీ బృందాల సభ్యులు తనిఖీ చేసి నివేదికలు ఇచ్చారు. వాటిని గ్రామ సభలో చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉంటే మండల కేంద్రంలో నిర్వహించే సామాజిక తనిఖీ బహిరంగ సభలో అధికారులకు తెలియజేయాలని సూచించారు. సర్పంచ్‌లు అన్నాడిశెట్టి నాగమ్మ, దువ్వూరు మంజులమ్మ, ఉపాధి ఏపీవో గిరిబాబు, ఎస్ఆర్‌పీ రవి, పంచాయతీ కార్యదర్శులు జగదీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



తూర్పుకనుపూరులో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

ఎస్సీ సబ్ ప్లాన్ కింద తోటల పెంపకం

వెంకటగిరి రూరల్ : ఎస్సీ సబ్ ప్లాన్ కింద తోటల పెంపకం చేపట్టవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి.గోవిందరాజులు తెలిపారు. ఆయన శనివారం వెంకటగిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ఎస్సీ సబ్ ప్లాన్ రుణాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ కింద గ్రామీణ మహిళలు, రైతులు, యువతకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేయడంతోపాటు సేంద్రియ వ్యవసాయ పద్ధలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ కురుగొండ్ల లక్ష్మిసాయి ప్రియతో కలిసి కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తిరుపాల్, నాగార్జున రెడ్డి, రాజీవన, విజయశ్రీ, ఏపీఎస్ఎఫ్ కో–ఆర్డినేటర్ సుహరిత తదితరులు పాల్గొన్నారు.



రైతులకు కురగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

దొరవారిసత్రం : హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించడం ప్రమాదకరమని నాయుడుపేట సీఐ జగన్మోహన్‌రావు తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం తల్లంపాడు సమీపంలోని టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనాల రికార్డులు ఉంచుకోవాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

ఆలయ స్థలానికి వేలం పాటలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం రాఘవేంద్ర దుకాణాల సముదాయం వెనుక ఉన్న విన్నమాల గ్రామ శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ భూమి 60 సెంట్లకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. నెలకు రూ.లక్ష అద్దె చెల్లించేలా ఆరవభూమి శ్రీనివాసులురెడ్డి స్థలాన్ని దక్కించుకున్నారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, గూడూరు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై కంది పప్పు, బియ్యం విక్రయాలు

చిల్లకూరు : ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు నిత్యావసర వస్తువులను రాయితీతో విక్రయిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం చిల్లకూరులోని సచివాలయం సమీపంలో పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో చిల్లర దుకాణంలో కంది పప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరులో ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తే తీర ప్రాంతంలోని ప్రజలకు అందుబాటులో ఉండేలా చింతవరంలో కూడా విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బియ్యం కేజీ ఒక రకం రూ.48లు, స్టీమ్ బియ్యం కేజీ ధర రూ.49లు, కందిపప్పు కేజీ రూ.160లకు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ మస్తానయ్య, వీఆర్వో రమణయ్య, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



మహిళకు బియ్యం ప్యాకెట్టు అందజేస్తున్న తహసీల్దార్

నెల్లూరు వైపు బస్సులు నడపండి

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు నుంచి నెల్లూరు వైపు వెళ్లడానికి ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఒక్క బస్సు కూడా లేదు. దీంతో ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాకాడులో ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ నెల్లూరు వెళ్లడానికి బస్సులు నడపకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులు నడపాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అలాగే గూడూరులో ఉదయం 6 గంటలకు బయలుదేరే విక్రమ సింహపురి రైలును అందుకోవడానికి అనువుగా ఉదయం 4.30 గంటలకు వాకాడులో బయలుదేరే నెల్లూరు సర్వీసును 4 గంటలకు మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే రాత్రి 11 గంటలకు గూడూరు నుంచి వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మండలసమావేశం వాయిదా

కోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు ఎంపీడీవో శంకరయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. త్వరలోనే మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేణుంబాకంలో వైద్య శిబిరం

దొరవారిసత్రం: మండలంలోని వెదురుపట్టులో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. షుగర్, బీపీ తదితర వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఘనంగా ప్రారంభమైన గురుపూర్ణిమ వేడుకలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం గురుపూర్ణిమ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి బాబాకు పల్లకీ సేవ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అగ్రహారపేట, బ్రాహ్మణ వీధిలోని సాయిబాబా ఆలయాల వద్ద పాలాభిషేకం, రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరామ్ ప్రసాద్, ఉభయదాతలు పాల్గొన్నారు.

కలువాయిలో చురుగ్గా పారిశుద్ధ్య పనులు

కలువాయి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్టు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఆయన శనివారం కలువాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు.

దుస్తుల పంపిణీ

కలువాయి: మండల కేంద్రమైన కలువాయిలో ఉన్న ఆర్యదయానంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం బద్దెవోలు గ్రామానికి చెందిన మల్లు గాయత్రేశ్వరి, భరత్‌కుమార్ రెడ్డి దంపతులు చీరలు, పంచెలు, పండ్లు అందజేశారు. గాయత్రేశ్వరి తల్లి ప్రభావతమ్మ సంవత్సరీకం సందర్భంగా దుస్తులు ఇచ్చామన్నారు.

27న మండల మీట్

సైదాపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష ఉంటుందని, అధికారులు హాజరుకావాలని కోరారు.

బాలికలను చదివించాలి

గూడూరు రూరల్ : బాలికలను చదివించాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న ఐసీడీఎస్ ఆఫీస్‌లో శనివారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న మూడేళ్ల దాటిన బాలికలను అంగన్‌వాడీల్లో చేర్పించేలా చూడాలన్నారు. తద్వారా ఆడపిల్లల్లో నిరక్షరాస్యతను తగ్గించవచ్చన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలని ఏబీవీపీ నిరసన



మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు



బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన మానవ హారం

సూళ్లూరుపేట : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలపై అఘాయిత్యాలు పెచ్చుమీరాయని, రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం కలుగుతోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి సూళ్లూరు యచంద్ర తెలిపారు. ఏబీవీపీ సూళ్లూరుపేట శాఖ ఆధ్వర్యంలో శనివారం 200 మంది బాలికలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవ హారం ఏర్పాటుచేశారు. నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు చూస్తుంటే ఇక్కడ ప్రభుత్వం పనిచేస్తోందా అనే అనుమానం కలుగుతోందని చెప్పారు. సాక్షాత్తూ హోం మంత్రి మహిళ అయినప్పటికీ సాటి మహిళలకు రక్షణ కరువైందని దుయ్యబట్టారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఉత్తుత్తి మాటలు చెప్పడం మానేసి మహిళలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకునే పనిలో వుండాలని సూచించారు. మహిళలపై అత్యాచారాలు ఎక్కడ జరిగినా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర, జిల్లా కన్వీనర్ సన్నీ, జిల్లా మహిళా కన్వీనర్ వైష్ణవి, వెంకటేష్, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మన పల్లెలను శుభ్రంగా ఉంచుకుందాం





సచివాలయం సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో, వీధులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సైదాపురం: మన పల్లెలను శుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీవో సుధాకర్ కోరారు. ఆయన శనివారం అనంతమడుగు గ్రామంలోని వీధులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయం పనితీరుపై సమీక్షించారు. ఆయన వెంట కార్యదర్శి వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గూడూరు రూరల్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు కోర్టు ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. ఆమె శనివారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కరికీ హక్కులు ఉంటాయన్నారు. వాటిని భంగం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టం తన పని తాను చేస్తుందన్నారు. జీవన విధానంలో మార్పులు చేసుకుంటే నేరాలను పూర్తిగా నియంత్రించవచ్చని వివరించారు. హీరోయిజం ప్రదర్శించాలని ప్రయత్నించి నేర ప్రవృత్తిలోకి దిగితే మీతోపాటు కుటుంబం కూడా ఇబ్బందులు పడుతుందని చెప్పారు. మత్తుకు బానిసలు కాకుండా జీవితాలను కాపాడుకోవాలన్నారు. ఈ జడ్జి సులోచనరాణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి రివార్డు

తడ : బాధితున్ని సకాలంలో వైద్యశాలకు తరలించి రక్తం దానం చేసి ప్రాణాన్ని కాపాడిన తడ ఏఎస్ఐ పి.శ్రీకుమార్‌రెడ్డిని ఎస్పీ సుబ్బరాయుడు శనివారం అభినందించి రివార్డు అందజేశారు. ఇటీవల శ్రీసిటీలో పనిచేస్తున్న వడ్డే సతీష్ కుమార్‌పై కాకినాడకు చెందిన రవీంద్రబాబు కత్తితో దాడి చేసిన సంగతి తెలిసిందే. డ్యూటీలో ఉన్న ఏఎస్ఐ పి.శ్రీకుమార్ రెడ్డి అతన్ని చెన్నై సమీపంలోని రెడ్ హిల్స్‌లో ఉన్న రేలా వైద్యశాలకు తరలించారు. అతనికి బి పాజిటివ్ గ్రూప్ రక్తం అవసరమైంది. ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి రక్తం అదేకావడంతో ఆయన రక్తం ఇచ్చి ప్రాణాన్ని కాపాడారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఏఎస్ఐని అభినందించి రివార్డుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు.



జిల్లా ఎస్పీ నుంచి రివార్డు అందుకుంటున్న ఏఎస్ఐ

ఇద్దరు నిందితుల అరెస్ట్

గూడూరు రూరల్: పట్టణంలోని రెండు ప్రాంతాలలో చోటు చేసుకున్న రెండు కేసుల్లో నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు స్థానిక డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గూడూరులోని అశోక్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థినిపై బుధవారం లైంగిక దాడికి పాల్పడిన రౌడీ షీటర్ వినయ్‌ను తాళమ్మ గుడి ప్రాంతంలో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే సాదూపేట సెంటర్‌లో హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేసిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన లల్తూ కలిండిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో సీఐ పాపారావు, ఎస్ఐలు కృషి చేసినట్టు కొనియాడారు.